ఆర్‌జియుకెటిలో నేడు టెక్‌జైట్‌-25 2.0 ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టెక్‌జైట్‌-25 2.0 ప్రారంభోత్సవం ఈ నెల 29న సాయంత్రం ఆరు గంటలకు ఎస్‌ఎసి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికిఉన్నత విద్యాశాఖ ఛైర్మన్‌, ఆర్‌జియుకెటి ఛాన్సలర్‌ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అలాగే ఈ కార్యక్రమానికి ఇద్దరు ప్రముఖ అతిథులు డాక్టర్‌ ఎల్‌వి.సుబ్రహ్మణ్యం, సివి.శ్రీధర్‌ (టిసిఎస్‌ డైరెక్టర్‌, క్వాంటమ్‌ మిషన్‌) హాజరవుతున్నారు. ఈ ఇద్దరు అతిథులు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం సిఎంఒతో కలిసి క్వాంటమ్‌ కంప్యూటింగ్‌ రంగంలో పని చేస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ టెక్‌జైట్‌ కార్యక్రమంలో ఆర్‌జియుకెటి ఉపకులపతి ఆచార్య ఎం.విజయకుమార్‌, రిజిస్ట్రార్‌, నూజివీడు క్యాంపస్‌ డైరెక్టర్‌ ఆచార్య అమరేంద్ర కుమార్‌, టెక్‌ జైట్‌ కన్వీనర్‌, డీన్‌ అకడమిక్స్‌ డాక్టర్‌ చిరంజీవి, పరిపాలనాధికారి డాక్టర్‌ లక్ష్మణరావు పాల్గొంటారు.

ఉప్పుటేరుకు కాలుష్యం కాటు

- ఉప్పుటేరు కలుషితంతో అంతరిస్తున్న మత్స్య సంపద
- 22 వేల మత్స్యకార కుటుంబాలకు ఇదే జీవనాధారం

ఉప్పుటేరు కాలుష్యం కాటుకు గురై క్రమంగా ఉనికిని కోల్పోతుంది. వ్యర్థాలు, ఆక్వా సాగుకు వాడే మందుల నీరు దీనిలో కలిసి కాలుష్య కాసారంగా తయారవుతోంది. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల సరిహద్దులో ప్రవహించే జీవనది ఉప్పుటేరు. కొల్లేరు సరస్సుకు బంగాళాఖాతానికి అనుసంధానంగా ఉన్న ఈ ఉప్పుటేరుకు ఇరువైపులా వేలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దీనిలో లభ్యమయ్యే చేపలే వీరికి జీవనాధారం. అవి నిండుగా దొరికిన రోజు మస్తు.. లేని రోజు పస్తు. ఒకప్పుడు కాసులు కురిపించిన ఉప్పుటేరు ప్రస్తుతం మత్స్యకారులను కన్నీరు పెట్టిస్తోంది.

కాలుష్యంగా మారిన ఉప్పుటేరు

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు 20 అడుగుల సగటు లోతున 65 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. సుమారు 30 పరివాహక గ్రామాలున్నాయి. 22 వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లభ్యమయ్యే మత్స్య జాతులు తగ్గి ప్రస్తుతం వాటిలో సగానికి సగం దొరకని పరిస్థితి. ఉప్పుటేరు దుస్థితి ప్రభావం భవిష్యత్తుల్లో కొల్లేటి సరస్సుపైన పడే అవకాశం ఉంది. కైకలూరు మండలం కొట్టాడ నుంచి మొదలైన ఉప్పుటేరు ఆకివీడు, ఏలూరుపాడు, మోడి మీదుగా ప్రవహించి కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురం-పల్లిపాలెం వద్ద రెండు పాయలుగా విడిపోయింది. దీనిలో ఒకటి మన జిల్లాలోని కాళీపట్నం వద్ద, మరొకటి పడతడతడిక మీదుగా వెళ్లి దిబ్బలపాలెం వద్ద సముద్రంలో కలుస్తున్నాయి. కొల్లేటి సరస్సు నుంచి ప్రతిరోజూ 10 వేల నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు సముద్రానికి చేరుతుంది. ఉప్పుటేరు లోతు ప్రాంతాన్ని బట్టి సగటున 20 అడుగుల వరకు ఉంటుంది.

కాలుష్య కాసారం ఉప్పుటేరు

కొల్లేరుకు అనుసంధానంగా ఉన్న ఈ ఉప్పుటేరు ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ఉండేది. దీనిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఆ నీటిని తాగునీటిగా వినియోగించేవారు. ఆ పరిస్థితి ఇప్పుడు తారుమారైంది. ఆక్వా రంగం ప్రారంభమైన తొలినాళ్లలో దీనిపై పెద్దగా ప్రభావం పడలేదు. రానురాను ఉప్పుటేరుకు ఆనుకుని వేలాది ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులు ఇబ్బడిముబ్బడిగా తవ్వడం ప్రధాన సమస్యగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వారా, లేదా నిబంధనల ప్రకారమే తవ్వారా అనేది పక్కన పెడితే చెరువుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఉప్పుటేరు కాలుష్యం బారిన పడింది. చెరువుల్లోంచి ఆక్వా వ్యర్థ నీటిని బయటకు వదిలేటప్పుడు శుద్ధి చేయకపోవడమే దీనికి కారణం. అధిక రసాయనాల వాడకం మరింత ప్రమాదకరంగా మారింది. పశ్చిమగోదావరి-ఏలూరు జిల్లాల సరిహద్దుల్లో ఆక్వా అనుబంధ పరిశ్రమల వ్యర్థాలు, రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలు ఈ ఉప్పుటేరులో కలుస్తున్నాయి. ఫలితంగా సహజ సిద్ధమైన అనేక రకాల చేప జాతులు క్రమంగా అంతరించిపోతున్నాయి.

జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

ఉప్పుటేరు తీరాన్ని ఆనుకుని పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో సుమారు 30 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 22 వేల కుటుంబాలు ఈ ఉప్పుటేరులో సహజ సిద్ధమైన మత్స్య సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వలకట్లు, విసురు వల, తేలువల, గూళ్లు, కంపలు వంటి ప్రక్రియ ద్వారా ఉప్పుటేరు నుంచి మత్స్య సంపదను మత్స్యకారులు చేజిక్కించుకునేవారు. ఒకప్పుడు ఏటిలో సుమారు 40 నుంచి 30 రకాల జాతులకు చెందిన మత్స్య సంపద లభించేది. ఉప్పుటేరు కలుషితంతో 20 రకాల జాతులు అంతరించిపోయాయని మత్స్యకారులు అంటున్నారు. ప్రస్తుతం 10 నుంచి 15 రకాల చేపలు మాత్రమే ఉప్పుటేరులో లభ్యమవుతున్నాయి. అవీ అంతంత మాత్రంగానే వలలకు చిక్కుతున్నాయి. వలలకు మత్స్య సంపద దక్కని పరిస్థితుల్లో మత్స్యకారులు పస్తులుండాల్సి వస్తోంది.

కొల్లేటి సరస్సుకు ముప్పు

ఉప్పుటేరు కాలుష్యం ప్రభావం కొల్లేరు సరస్సుపై పడుతుందని ప్రకృతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. పోటు సమయంలో ఏరులోని నీరు సముద్రంలోకి వెళ్తోంది. పోటు సమయంలో సముద్రపు నీరు ఎగదన్నుతుంది. దీంతో ఉప్పుటేరులోని నీరు కొల్లేరులో కలుస్తుంది. దీనివల్ల అక్కడ మత్స్య సంపదతోపాటు విదేశాల నుంచి వచ్చే పక్షులకు భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

వలసలు తప్పవు

తిరుమాని శ్రీనివాస్‌, మత్స్యకారుడు, ప్రాతళ్ల మెరక

మత్స్యజాతులు చాలా వరకు అంతరించిపోవడం వల్ల రోజంతా ఉప్పుటేరులో చేపల కోసం వేటాడినా పూట గడవడం కష్టంగా మారింది. దీంతో చాలా కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడుతున్నాయి. కొంతమంది రొయ్యల చెరువుల కాపలాదారులుగా, మరికొంతమంది చేపల పట్టుబడికి వెళ్తున్నారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేసే పరిస్థితి రాకముందే ఉప్పుటేరును రక్షించాలి. ఆక్వా సాగు విస్తరణతో ఉప్పుటేరులోకి కలుషిత జలాలు యథేచ్ఛగా కలుస్తున్నాయి. వాటి ప్రభావం వల్ల మత్స్య సంపద మరింత తగ్గే ప్రమాదం ఉంది. ఉప్పుటేరును కాలుష్యం నుంచి ప్రక్షాళన చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

ఆక్వా వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి

మోపిదేవి శ్రీనివాసరావు, రాష్ట్ర మత్స్యకార సంఘ నాయకుడు



ఉప్పుటేరులోని మత్స్య సంపదపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. 20 సంవత్సరాల క్రితం ఉప్పుటేరు నీటిని తాగడానికి ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆ నీరు తాగేందుకు పనికి రావడం లేదు. ఉప్పునీటి శాతం పెరిగిపోయింది. రొయ్యల చెరువుల్లోని కలుషిత వ్యర్థాలు ఉప్పుటేరులోకి వదలడంతో ఉప్పుటేరు కలుషితమైంది. ఆక్వా అనుబంధ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వల్ల మత్స్యసంపదకు మరికొంత నష్టం వాటిల్లుతుంది. ఉప్పుటేరులోకి కలుషిత వ్యర్థాలు వదలకుండా నివారించగలిగితే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను చేర్చాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలోని ఆదివాసీ ప్రాంతాలను చేర్చాలని, కూటమి ప్రభుత్వం శాస్త్రీయంగా ఆలోచించాలని, ప్రజాభిప్రాయానికి విలువనివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో చేసిన రెండో ప్రకటన ఏజెన్సీ ప్రాంత ప్రజలను నిరుత్సాహానికి గురిచేసిందని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ఆదివాసీ ప్రాంతాలను పోలవరం జిల్లాలో కలపాలని కోరుతూ కొంతకాలంగా ఆ ప్రాంత ఆదివాసీలు, ప్రజాసంఘాలు, ప్రజానీకం పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఎటువంటి స్పందనా లేకుండా ప్రభుత్వం తమకు నచ్చినట్లు వ్యవహరిస్తుందని, ప్రజాభిప్రాయానికి విలువ లేకుండా పోతుందని విమర్శించారు. మొదటి ప్రకటనలో శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేస్తున్నామని ప్రకటించుకున్న ప్రభుత్వం పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం శాస్త్రీయమా అని ఆయన ప్రశ్నించారు. ఇది పూర్తిగా అశాస్త్రీయమైందని, పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని, ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఏ శాస్త్రీయతా లేకుండా ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేయడమేమిటని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ నాయకులతోపాటు చాలామంది ఈ రోజుకీ పోలవరం జిల్లాలో పోలవరం ఉందనే భ్రమలో ఉన్నారని, పోలవరం జిల్లాలో పోలవరం లేదని తెలిసి ఆశ్చర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పుడు రెండో ప్రకటనలో ప్రభుత్వం ప్రజల అభిప్రాయ సేకరణకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తున్నామని చెబుతున్నా అది కూడా ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాలను చేర్చాలని కోరుతూ గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారని, సచివాలయాలు, తహశీల్దార్‌ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయడంతోపాటు ఈ నెల 22న మన్యంబంద్‌ కూడా విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మొదట శాస్త్రీయంగా చేస్తామని చెప్పి అశాస్త్రీయంగా ప్రకటించారని, ఇప్పుడు ప్రజల అభిప్రాయం మేరకే చేస్తామని చెప్పి ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా తమకు నచ్చినట్లు చేసుకుంటూ పోతున్నారని విమర్శించారు. ఈ తరహా ప్రభుత్వ వైఖరిని తాము పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కేబినెట్లో ఈ అంశంపై చర్చించి ప్రభుత్వం శాస్త్రీయంగాను, ప్రజాభిప్రాయానికి అనుగుణంగాను జిల్లాల పునర్విభజన చేయాలని, పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాలను కలపాలని డిమాండ్‌ చేశారు.

నేడు పోలవరం బంద్‌

జిల్లా సాధన కమిటీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలిపి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు నాళం గాంధీ, ముగ్గ మురళీకృష్ణ, ముత్యాల రాంబాబు, సొబ్బన మోహన్‌, కె.శ్రీనివాస్‌, సొబ్బన రాజశేఖర్‌బాబు డిమాండ్‌ చేశారు. ఈ నెల 29వ తేదీ సోమవారం పోలవరం బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలవరం జిల్లా సాధన కోసం పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో మండలాలు, పోలవరం గ్రామం లేకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోకుండా పోతుందని సాధన సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనగా సోమవారం పోలవరం బంద్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు, నియోజకవర్గంలో అన్ని మండలాలు, గ్రామాల ప్రజలు సహకరించి బంద్‌ పాటించాలని పేర్కొన్నారు.

ఇంటర్‌ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియట్‌ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఒ) కె.యోహాన్‌

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఫిబ్రవరిలో ప్రారంభం కానున్న ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తునామన్ని జిల్లా ఇంటర్మీడియట్‌ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఒ) కె.యోహాన్‌ తెలిపారు. ఎంతమంది విద్యార్థులు పబ్లిక్‌ పరీక్షలకు హాజరు కానున్నారు, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు, ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ఏపీ యాజమాన్యాల పరిధిలో మొత్తం ఎన్ని ఇంటర్మీడియట్‌ కళాశాలలు ఉన్నాయి?

ఆర్‌ఐఒ: జిల్లాలో మొత్తం 135 ఇంటర్మీడియట్‌ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ కళాశాలలు 19, సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలు 6, గిరిజన సంక్షేమ శాఖ కళాశాలలు 3, కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయాలు 3, హైస్కూల్‌ ప్లస్‌ 21, ప్రయివేటు కళాశాలలు 82, ఎయిడెడ్‌ కళాశాల ఒకటి ఉన్నాయి.

ప్రశ్న: ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి? ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు?

ఆర్‌ఐఒ: ఇంటర్మీడియట్‌ రాత పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 17,531 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 16,975 మంది, మొత్తం 34,506 మంది హాజరు కానున్నారు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని పరీక్షా కేంద్రాలు కేటాయించారు?

ఆర్‌ఐఒ: జిల్లాలో రాత పరీక్షలకు 56 పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్‌ పరీక్షలకు 71, ఒకేషనల్‌ పరీక్షలకు 27 కేంద్రాలు కేటాయించాం

ప్రశ్న: ప్రాక్టికల్‌ పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి?

ఆర్‌ఐఒ: జనరల్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు, ఒకేషనల్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ప్రాక్టికల్‌ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగనున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు క్వాలిఫైయింగ్‌ పరీక్షలైన ఎథిక్స్‌ అండ్‌ హ్యూమన్‌ వాల్యూస్‌ పరీక్ష జనవరి 21న, ఎన్విరాన్‌మెంటల్‌ ఎడ్యుకేషన్‌ పరీక్ష జనవరి 23న జరగనున్నాయి. విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్ష క్వాలిఫై కావాల్సి ఉంటుంది.

ప్రశ్న: పరీక్షల ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి?

ఆర్‌ఐఒ: ఇప్పటికే ఇంటర్మీడియట్‌ బోర్డు అధికారులతో మారిన సిలబస్‌ తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించాం. జిల్లాలో డిపార్టుమెంటల్‌ ఆఫీసర్లు, చీఫ్‌ సూపరింటెండెంట్లతో మీటింగ్‌ జరగాల్సి ఉంది. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్‌ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్‌ మీటింగ్‌ కూడా జరగాల్సి ఉంది. ప్రాక్టికల్‌ థియరీ పరీక్షలన్నీ సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్‌ఐఒ: సంకల్ప్‌ 2026 పేరుతో అన్ని ప్రభుత్వ కళాశాలల్లో 50 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీనిలో విద్యార్థులను ఎ, బి, సిలుగా విభజించి వెనుకబడిన విద్యార్థులను కేర్‌టేకర్‌ల సమక్షంలో చదివించాం. వారిని అన్ని రకాలుగా పరీక్షలకు సిద్ధం చేసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా సిద్ధం చేశాం.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఏమైనా ఉందా? జిల్లాలో ఎంతమంది రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌ అధ్యాపకులు పని చేస్తున్నారు?

ఆర్‌ఐఒ: జిల్లాలో అధ్యాపకుల కొరత లేదు. 46 మంది రెగ్యులర్‌ అధ్యాపకులు, 110 మంది కాంట్రాక్ట్‌ అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరుకాక గెస్ట్‌ అధ్యాపకులు కూడా పని చేస్తున్నారు. అధ్యాపకుల విషయంలో విద్యార్థులకు ఎలాంటి లోటూ లేదు.

ప్రశ్న: హైస్కూల్‌ ప్లస్‌లో ఉత్తీర్ణతా శాతం బాగా తక్కువగా ఉంటుంది, కారణం ఏమిటి?

ఆర్‌ఐఒ: అది పూర్తిగా స్కూల్‌ ఎడ్యుకేషన్‌ డిపార్టుమెంట్‌ పర్యవేక్షణలో ఉంటుంది. కేవలం పరీక్షలు నిర్వహించడం వరకే ఇంటర్మీడియట్‌ బోర్డు బాధ్యత. ఒకపక్క హైస్కూల్‌ తరగతులు బోధిస్తూనే హైస్కూల్‌ ప్లస్‌ తరగతులకు కూడా బోధించాల్సిన పరిస్థితుల్లో సిబ్బంది కొరత ఉండి ఉండొచ్చు.

ప్రశ్న: ఇంటర్‌ పరీక్షలు రాసే విద్యార్థులకు మీరిచ్చే సలహా ఏమిటి?

ఆర్‌ఐఒ: ఇంకా నెల రోజులు సమయం ఉంది. కాబట్టి విద్యార్థులు క్షుణ్ణంగా సిలబస్‌ మొత్తం పూర్తిగా చదువుకుని పరీక్షలకు హాజరు కావాలి. ఏమైనా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటే ఇప్పటి నుంచి అధ్యాపకుల సలహాలు తీసుకుని ఆయా సబ్జెక్టులను మెరుగుపర్చుకోవాలి. చివరి రోజుల్లో ఒత్తిడికి గురికాకుండా ముందు నుంచి ఒక ప్రణాళిక ప్రకారం చదివితే మంచి ఉత్తీర్ణత సాధించొచ్చు.

అఖిల భారత మహాసభకు విస్తృత ప్రచారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరగనున్నాయి. మహాసభ జయప్రదం కోరుతూ జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలో కార్మికుల స్థితిగతులు, మహాసభ ప్రచారం, బహిరంగ సభకు జిల్లా నుంచి సమీకరణ తదితర అంశాలపై ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న: ప్రస్తుతం జిల్లాలో కార్మికుల స్థితిగతులు ఎలా ఉన్నాయి?

జవాబు: గత 11 సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు పూర్తి ప్రజా వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నాయి. కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయి. అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు లేవు. పిఎఫ్‌, ఇఎస్‌ఐ, బోనస్‌ అమలు కావడం లేదు. సంక్షేమ బోర్డుల ద్వారా కార్మికులకు క్లెయిములు చెల్లించడం లేదు. ప్రభుత్వాల పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణా రంగ కార్మికులపై అధిక పెనాల్టీలు విధిస్తూ వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు, వేతనాలకు మధ్య వ్యత్యాసం పెరిగి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రశ్న: ఈ కాలంలో ఏఏ అంశాలపై పోరాటాలు చేశారు?

జవాబు: అంగ న్వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పోరాటాలు సాగాయి. అనేక పరిశ్రమల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించాం. చింతలపూడి సమీపంలోని గోద్రెజ్‌ పరిశ్రమలో యూనియన్‌ ఏర్పాటు చేశాం. భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికుల సమస్యలపై విస్తృత పోరాటాలు సాగించాం. మున్సిపల్‌, పంచాయతీ కార్మికులు, విఒఎలు, సర్వశిక్ష అభియాన్‌ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు నిర్వహించాం. ఇటీవల ప్రమాదాలకు గురవుతున్న పామాయిల్‌ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశాం.

ప్రశ్న: అఖిలభారత మహాసభ ప్రచారం జిల్లాలో ఎలా సాగింది?

జవాబు: సిఐటియు మహాసభ ప్రచారం జిల్లాలో గత నాలుగు నెలలుగా విస్తృతంగా సాగించాం. జిల్లాలోని 27 మండలాల్లో కార్మిక సంఘాలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులు, ఇతర కార్మికులు పని చేసే ప్రదేశాల్లో విస్తృతంగా ప్రచారం చేశాం. 75 వేల కరపత్రాలను ముద్రించి ప్రచారంలో పంపిణీ చేశాం. జిల్లాలోని 250 గ్రామాల్లో అంగన్వాడీ, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి మహాసభపై విస్తృత ప్రచారం సాగించారు. కార్మికులు పని చేసే ప్రతి ప్రదేశంలోనూ మహాసభ ప్రచారం సాగింది.

ప్రశ్న: ప్రచారం సందర్భంగా కార్మికుల స్పందన ఎలా ఉంది?

జవాబు: కార్మికుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. సిఐటియు నేతలతోపాటు స్థానిక కార్మికులు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇంటింటా ప్రచారం, పని ప్రదేశాల్లో ప్రచారంలోనూ కార్మికులు విస్తృతంగా పాల్గొని తమ సహాయ సహకారాలు అందించారు. జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నుంచి మూడు వేల మంది వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు.

సిఐటియు మహాసభ.. వెళ్దాం పద పద

ఏలూరులో ఫ్లెక్సీ బోర్డుల ఏర్పాటు
పలుచోట్ల ముమ్మరంగా వాల్‌రైటింగ్‌
భీమవరంలో 18 అడుగుల జెండా ఆవిష్కరణ
పలుచోట్ల మోటారు సైకిల్‌ యాత్రలు
విశాఖ శ్రామిక ఉత్సవ్‌లో నేడు 'మన్యం విప్లవం' వీధి నాటిక ప్రదర్శన

ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సిఐటియు అఖిల భారత మహాసభ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో పలు కూడళ్లలో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే పలుచోట్ల వాల్‌ రైటింగ్‌ నిర్వహించారు. భీమవరంలోని మున్సిపల్‌ కార్మికవాడలో 18 అడుగుల సిఐటియు పతాకాన్ని కార్మికులు ఆదివారం ఆవిష్కరించారు. తణుకు మున్సిపల్‌ కార్యాలయం వద్ద హలో కార్మిక-చలో విశాఖ బహిరంగ సభ కరపత్రాన్ని పంపిణీ చేశారు. ముఖ్యకూడళ్లలో బ్యానర్లు ఆవిష్కరించారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న శ్రామిక ఉత్సవ్‌లో మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వీధి నాటిక ప్రదర్శించేందుకు ఆకివీడులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో షేక్‌ వలీ నాయకత్వంలో రిహార్సల్స్‌ నిర్వహించారు. భీమవరం, ఉండి మండలాల్లో మోటారు సైకిల్‌ ర్యాలీలు నిర్వహించారు.

నిడమర్రు : విశాఖలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని అడవికొలను, భువనపల్లి, ఎనికెపల్లి గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిల భారత మహాసభ నేపథ్యంలో జనవరి నాలుగో తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు. సిఐటి మండల కన్వీనర్‌ కానూరు రాజు, వెలగలేటి మోహన, అందే పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : సిఐటియు 18వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. నాలుగో 4వ తేదీ విశాఖపట్నంలో జరగనున్న బహిరంగ సభకు కార్మికులందరూ కలిసి కదలిరావాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు, సిఐటియు మండల కమిటీ సభ్యులు బుస్సా రామనాగేంద్రరావు, డివైఎఫ్‌ఐ నాయకులు గద్దె అనిల్‌కుమార్‌, ప్రజా సంఘాల కార్యకర్తలు లేళ్లరాజు, దోనె ఏసుపాదం, మెండా కోటేశ్వరరావు, కొంగల జకరయ్య, మేడేపల్లి దావీదు, గుజ్జుల నాగరాజు పాల్గొన్నారు.

కలిదిండిలో...

నిడమర్రులో..

కొనసాగిన ఆర్‌జియుకెటి అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల నిరసన

నిరసన తెలుపుతున్న అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రతిష్టాత్మక ఐఐటీలు, సెంట్రల్‌ యూనివర్సిటీల్లో చదువుకుని 2010-14 సంవత్సరాల్లో ఆర్‌జియుకెటిలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్లుగా చేరిన అధ్యాపకుల వేతనాలు పెంచాలని కోరుతూ చేస్తున్న శాంతియుత నిరసన దీక్ష ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. న్యాయంగా తమకు ఇవ్వాల్సిన వేతనాల విషయమై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించాలని వారు నినదించారు. వీరికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ కొంతమంది మెంటర్లు కూడా నిరసన దీక్షలో పాల్గొన్నారు. రుద్రం చింతయ్య నాయుడు, సతీష్‌, మధుసూదనరెడ్డి, వేణుగోపాల్‌, భరత్‌, సుబ్బారావు, కృష్ణ, విజయశ్రీ, భవాని, దీప్తి సాహు, బాపిరాజు, గణేష్‌, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్‌ మిశ్రా, లక్ష్మణరావు, మధు, అమరేంద్రదాస్‌, వెర్రియ్య నాయుడు, సీతాపతిరావు తదితర అధ్యాపకులు సెలవు రోజున కూడా నిరసన దీక్షలో కూర్చున్నారు. తమ వేతనాల పెంపు విషయంలో వీలైనంత తొందరగా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పరిష్కరించాలని కోరారు.

నేడు భీమడోలులో రెవెన్యూ క్లినిక్‌

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు తహశీల్దార్‌ కార్యాలయం వేదికగా ఈ నెల 29వ తేదీ సోమవారం రెవెన్యూ క్లినిక్‌ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్‌ బి.రమాదేవి తెలిపారు. మండల పరిధిలో భూములు ఉన్న రైతుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో ఆర్‌ఒఆర్‌ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్‌ పుస్తకాలు, డి-ఫారం పట్టాలు, అడంగల్‌ సవరణలు, అక్రమ ఆక్రమణలు, మ్యూటేషన్‌, కొలరేషన్‌ జాయింట్‌ ఎల్‌పిఎం, ఎఫ్‌ లైన్‌, రీ సర్వే వ్యత్యాసాలు, ఆర్‌ఒఆర్‌ అప్పీళ్లు, 22-ఎ ఇతర రెవెన్యూ, సర్వే సమస్యలు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో వాటిపై విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని తహశీల్దార్‌ వివరించారు. రైతులు కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సొసైటీ శతాబ్ది మహోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎంఎల్ఎ మాట్లాడుతూ పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వందేళ్ల కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సొసైటీల విషయంలో ప్రతి రైతన్నకు సహకార బ్యాంకులకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మానికల నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాతూరి అంబేడ్కర్, కోడూరి వరప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వెనుకబడిన తరగతుల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే లక్ష్యంతో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ప్రత్యేక ప్రేరణ, శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారత అధికారి ఆర్.నాగరాణి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య నిర్ధారణతో క్రమశిక్షణగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎబిసిడబ్ల్యుఒలు, వసతి గృహ సంక్షేమ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు అవసరమైన అకడమిక్ మార్గదర్శనం అందించారు. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి, సమయ నిర్వహణ, ప్రశ్నాపత్రం విశ్లేషణ వంటి అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో దోహదపడతాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కంతలగూడెం గ్రామంలో ఆదివారం అభివృద్ధి పనులకు వరుసగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సుమారు రూ.ఎనిమిది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రూ.పది లక్షల వ్యయంతో నిర్మించిన నూతన డ్రెయిన్‌ను ప్రారంభించారు. గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా సుమారు రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామాలే దేశానికి వెన్నెముకని, గ్రామాభివృద్ధి లేకుండా రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని చెప్పారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, పంచాయతీ భవనాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెం షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు వీటిని అందించామని కమిటీ సభ్యులు రత్నాజీ, తదితరులు తెలిపారు.

మానవత సభ్యులకు సత్కారం

ప్రజాశక్తి - మండవల్లి

సేవ చేయడానికి ఏర్పడిన సంస్థ మానవత స్వచ్ఛంద సంస్థని ప్రొఫెసర్ సుధాకుత్తుల విజయకుమార్ స్పష్టం చేశారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం మానవతా సంస్థ మండల ఛైర్మన్ గుడివాడ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన సమాజ స్థాపన కోసం మానవత స్వచ్ఛంద సంస్థ నిరంతరం సేవలందిస్తూనే ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా నిత్యావసర సరుకులు నెలవారి పంపిణీ చేయడంతో పాటు మార్చురీ బాక్సులు కూడా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అయ్యవారిరుద్రవరంలో పరసా పోతురాజు జ్ఞాపకార్థం వారి కుమారులు పరసా గోపాలకృష్ణ రత్నాకర్‌రావు రూ.72 వేల విలువైన మార్చురీ బాక్సును మానవత స్వచ్ఛంద సంస్థకు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పరసా గోపాలకృష్ణ కుటుంబ సభ్యులను దుశ్శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన చిన్నం సీతమ్మకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బొల్లంపల్లి కృష్ణారావు, కార్యదర్శి వీరవల్లి శివయ్య, కోశాధికారి పరిసే కిన్నిబాబు, కార్యవర్గ సభ్యులు గంజాల శ్రీనివాసరావు, మానవత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై కుటుంబం నిరాశ్రయులైన సంఘటన శనివారం రాత్రి పోలవరం మండలం దేవరగొంది పునరావాస కాలనీలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. దేవరగొంది గ్రామానికి చెందిన అభిమళ్ల సత్యనారాయణ అపోలో ఫార్మసీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం భార్య బిడ్డతో సమీపంలో ఉన్న చర్చిలో జరుగుతున్న క్రిస్మస్ వేడుకలకు వెళ్లారు. మరో కుమారుడు ఇంటోనే ఉన్నాడు. మంటలు చెలరేగడం గమనించిన కుమారుడు విషయం తండ్రికి చెప్పాడు. స్థానికులు మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించారు. మంటలకు గ్యాస్ సిలిండర్ పేలి భారీ శబ్దం కావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. మంటల్లో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సామగ్రి, సర్టిఫికెట్లు, గ్యాస్ సిలెండర్లు, బంగారు ఆభరణాలు కాలిపోయి నిరాశ్రయులయ్యారు. కార్మెల్పురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పొట్నూరి అప్పారావు నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, నూతన వస్త్రాలు, దుప్పట్లు సహాయంగా అందించారు. సంఘటనా ప్రాంతాన్ని ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తహశీల్దార్‌తో మాట్లాడి తగు సహాయ చర్యలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. టిడిపి మండలాధ్యక్షులు మంగిన కొండ తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి రూ.రెండు వేలు అందించారు. పోలవరం సర్పంచి కుమారుడు పొడుం శ్యామ్ గ్యాస్ పొయ్యి, కూరగాయలు అందించారు.

చీటింగ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో కంపెనీని మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వీరంకి శ్రీరాములుపై గతంలో జంగారెడ్డిగూడెం పిఎస్‌లో కేసు నమోదైంది. నిందితుడు పరారీలో ఉంటూ తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో గట్టి నిఘా పెట్టిన పోలీసులకు పక్కా సమాచారం అందటంతో జీలుగుమిల్లి చెక్ పోస్ట్ వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా కోర్టు వారు నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం ఏలూరు సబ్‌జైలుకు తరలించినట్లు ఈ కేసులో ఇప్పటికే ఎ2 ముద్దాయి సతీష్, ఎ 3 ముద్దాయి వినోద్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

జీలుగుమిల్లి : ద్విచక్ర వాహనం సీటు కింద గంజాయి పెట్టి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం సీటులో పది కేజీల గంజాయిని ఒడిశా బోర్డర్ నుంచి తెలంగాణ ప్రాంతం కామారెడ్డికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ తనిఖీల్లో సిఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.క్రాంతికుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రంగు మారిన నీళ్లు సరఫరా

అనారోగ్యాల బారిన పడుతున్నామని పాకలగూడెం వాసుల ఆవేదన

పైపులను, ట్యాంకును శుభ్రం చేయాలని వేడుకోలు


వాటర్‌ట్యాంకు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి పంచాయతీ పాకలగూడెం గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంక్ గుండా గత రెండు నెలలుగా రంగు మారిన నీరు వస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగు మారిన నీటినే తాగు నీటి అవసరాలకు వాడుతున్నామని చెబుతున్నారు. ఈ రంగు మారిన నీటిని తాగడంతో గ్రామంలో పలువురు పిల్లలు, పెద్దలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ములగలంపల్లి పంచాయతీ అభివృద్ధి అధికారి సెలవులో ఉండటంతో మంచి నీటి ట్యాంకును పరీక్షించడానికి సిబ్బంది రావట్లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మోటార్ మరమ్మతులకు గురి కావడంతో పంచాయతీ సిబ్బంది వచ్చి మోటార్‌కు మరమ్మతులు చేసి బిగించి వెళ్లారు. తప్పితే పైపులను కాని ట్యాంక్‌ను కాని శుభ్ర పరచలేదని వాపోతున్నారు. మారుమూల గ్రామం కావడంతో తాగడానికి మినరల్ వాటర్ తెచ్చుకోవాలంటే నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి రావడంతో పలువురు వెళ్లలేక ఇదే నీటిని తాగుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి తమ గ్రామ వాటర్ ట్యాంకును, పైపులను శుభ్రం చేయించి తాగేందుకు ట్యాంక్ గుండా మంచి నీటిని అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.


రంగు మారిన నీరు

జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నాం

కట్టం నాగమణి

మా గ్రామంలో తాగడానికి ఇదే నీటిని ఉపయోగిస్తున్నాం. ఇటీవల కొన్ని రోజులుగా నీరు రంగు మారడంతో ఈ నీటిని తాగుతుంటే జ్వరం, దగ్గు, రొంపలతో బాధపడుతున్నాం

కొన్ని నెలలుగా రంగు మారిన నీరే

సిహెచ్.నాగు

గత కొన్ని నెలలుగా మా ట్యాంక్ గుండా రంగు మారిన నీరు వస్తుంది. ఇదే నీటిని తాగునీటి అవసరాలకు వాడటం వల్ల అనారోగ్యాల బారిన పడతామెమోనని భయంగా ఉంది.

పైపులైను శుభ్రం చేయలేదు

సవలం గంగాదేవి

కొన్ని రోజులుగా ట్యాంక్ నుంచి నీరు రంగు మారి వస్తుంది. సిబ్బంది వచ్చి మోటార్ పోతే మరమ్మతులు చేసి వెళ్లారు. కాని పైపులను శుభ్రం చేయలేదు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

గుర్రపు డెక్కతో డెకరేషన్ వస్తువుల తయారీ

త్వరలో భీమడోలులో శిక్షణ

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామీణ ప్రాంత మహిళా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యంగా పెరటి కోళ్ల పెంపకం ఎంతో కీలకమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు మహిళా సమైఖ్య కార్యాలయం వద్ద ఆదివారం పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఉంగుటూరు మండలంలోనే తొలి విడతగా 200 యూనిట్లు పెరటి కోళ్లు అందించడంలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి ఉందని ఎంఎల్ఎ అన్నారు. ఆరు కోడిపెట్టలు, నాలుగు కోడిపుంజులు, దాణా, వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ ఒక యూనిట్‌గా నిర్ణయించారు. యూనిట్ ధర రూ.ఐదు వేలు కాగా లబ్ధిదారులైన మహిళా రైతులకు కోళ్లను పంపిణీ చేశారు. డిఆర్‌డిఎ డిపిఎం పార్థసారధి మాట్లాడుతూ వినూత్న మార్గాల్లో సంపద సృష్టించి మహిళలు ఆదనపు ఆదాయం సముపార్జించే దిశలో భాగంగా ఐదు సెంట్ల విస్తీర్ణంలోనే కొరమేను చేపలు పెంచేందుకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రయోగాత్మకంగా రూ.1.70 లక్షలతో వెయ్యి కొరమేను పిల్లలను పెంచితే వాటిలో 900 చేపలు పెరగ్గా వాటిని మార్కెట్ చేయగా ఖర్చులు పోనూ రూ.రెండు లక్షల మిగులు వచ్చిందన్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా చింతలపూడిలో ఐదు యూనిట్లు మంజూరు చేశామని, ఉంగుటూరుకు మూడు యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. కొరమేను పెంపకం యూనిట్ ధర రూ.4.40 లక్షలు అని, వీటికి పిఎంఇజిపిలో 30 శాతం రాయితీపై రుణ సదుపాయం ఉందని చెప్పారు. డిఆర్‌డిఎ పీడీ విజయరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గం అభివృద్ధిలో ముందుంటుందన్నారు. ఇక్కడి డ్వాక్రా, మహిళా రైతులు వినూత్న పద్ధతులతో కుటీర చేతి వృత్తులతో అదనపు ఆదాయలు పొందడం వల్లే పెరటి కోళ్ల యూనిట్లు ఉంగుటూరుకు తొలివిడతలో మంజూరు చేశామన్నారు. భీమడోలు మండలంలో గుర్రపు డెక్క, తూడుతో కొల్లేరు ప్రాంత మహిళలకు అదనపు ఆదాయం కోసం ప్రాసింగ్ చేసి డెకరేషన్ వస్తువులు తయారు చేసేందుకు ఎంఎల్ఎ ధర్మరాజు చొరవతో ప్రతిపాదనలు పంపించగా వాటికి ఆమోదం వచ్చిందన్నారు. త్వరలో భీమడోలులో గుర్రపుడెక్కతో వస్తువుల తయారీపై శిక్షణా కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. కోడి, పాడి, పంట అమ్మ నేర్పిన ఆర్థిక విధానమని మళ్లీ పాత రోజులను గుర్తు చేసేలా కోళ్ల పెంపకంపై ప్రభుత్వం దృష్టి సారించడం అభినందనీయమని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, ఉప సర్పంచి జగదీష్, డిప్యూటీ ఎంపిడిఒ జి.రమేష్, అడపా శోభారాణి, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.


పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

కూటమి ప్రభుత్వం అంటేనే పేదల పక్షపాతి ప్రభుత్వమని, పేదలకు మెరుగైన విద్య వైద్య సేవలను అందిస్తూ కూటమి ప్రభుత్వం వారికి అన్నివిధాలా అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అనారోగ్య కారణాలతో బాధపడుతూ మెరుగైన వైద్య సేవల కోసం చూస్తున్న 49 మంది బాధితులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చొరవతో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన దాదాపు రూ.50 లక్షల చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని, గ్రామీణ స్థాయిలో సైతం వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవకు అవకాశం లేక, ఇతర ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందిన వారికి కూడా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి సిఎం సహాయ నిధి నుంచి సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతనందిస్తూ కష్ట కాలంలో సైతం కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంతో చక్కటి ప్రణాళికతో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలవుతుందని టిడిపి నేతలు అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు విద్యామృతం పథకం ద్వారా మంత్రి పార్థసారధి వారి తండ్రి కొలుసు పెద్ద రెడ్డయ్య ట్రస్ట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటలకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఈ నెల 26న ప్రారంభించారు. దీనిలో భాగంగా గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నూర్ భాషా రంగవల్లి, పాఠశాల స్థలదాత కుమారులు రాయింకుల లక్ష్మణ్, టిడిపి నాయకులు కొల్లి గంగారం, పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగబాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి డిఎస్‌పి పరామర్శ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గుండెపోటుతో మరణించిన హోంగార్డు పోతర్లంక ఏసుబాబు భౌతికకాయాన్ని ఆదివారం సాయంత్రం నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ సందర్శించి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కార్యాలయం నుంచి రూ.పది వేలు ఇవ్వగా ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ తన సొంత నిధుల నుంచి తక్షణ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ ఏసు కుటుంబానికి డిపార్ట్‌మెంట్ ద్వారా వచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.ఐదు లక్షలతో పాటు ఇతర బెనిఫిట్స్ కూడా త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, ఏసు రెండో కుమారుడైన పోతర్లంక రాజేష్‌కు తండ్రి ఉద్యోగం వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిఎస్‌పి

దూదేకుల నూర్ భాషా సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో దూదేకుల నూర్‌భాషా సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా ఫెడరేషన్ ఛైర్మన్ నాగుల మీరా, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, గోపాలపురం ఎఎంసి ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి యేపూరి దాలయ్య, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు దేవరపల్లి వీరస్వామి చౌదరి, మొగతడకల లక్ష్మీరమణి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి శ్యామ్యులు, గోపాలపురం. వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్, ఐటిడిపి మండలాధ్యక్షులు ఏపూరి కిషోర్, దూదేకుల సంఘం నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల జీవిత విధానాలు మెరుగు

141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పలువురు నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

దేశ రాజకీయాల్లో ప్రజల పక్షాన నిలబడి, రాజకీయాలకు అతీతంగా సామాన్య ప్రజల జీవిత విధానాన్ని మెరుగుపరిచే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యేంద్రబాబు అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ 140 సంవత్సరాల ఘన చరిత్రను పూర్తి చేసుకుని 141వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చింతలపూడి మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ చింతలపూడి పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఉన్నమట్ల ఎలిజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యేంద్ర బాబు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన పార్టీగా, రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటమే కాంగ్రెస్ పార్టీ అసలైన అజెండా అని, సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికతత్వం వంటి మూల విలువలను కాపాడుతూ ముందుకు సాగుతామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలపరిచేందుకు కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని ఆయన సూచించారు.

ఏలూరు సిటీ : జాతీయ కాంగ్రెస్ 141వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించి, జైలు శిక్షలు అనుభవించి, ఆస్తులు త్యాగం చేసిన కాంగ్రెస్ యోధులకు వినమ్రంగా నమస్కారాలు తెలిపారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ఆర్‌జియుకెటి ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పి.వి.లక్ష్మణరావు సమన్వయంతో పాటు, సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్స్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా కొనసాగాయి. యూనిట్-2 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దత్తత గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో గ్రామ పరిశుభ్రత, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, చెట్ల నాటకం, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, "సే నో టు డ్రగ్స్" ప్రచారం, ఆరోగ్యం-పరిశుభ్రతపై అవగాహన, పాఠశాలల శుభ్రత, ఇంటింటి సర్వేలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. చివరిరోజు మధ్యాహ్న భోజనం అనంతరం ఎంపియుపి పాఠశాల ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం వాలంటీర్ల ఐక్యత, జట్టు భావం పెంపొందించేలా వివిధ ఆటలు నిర్వహించారు. గ్రామస్తులు వాలంటీర్ల సేవాభావాన్ని ప్రశంసించారు. యూనిట్-4 ఆధ్వర్యంలో గొడుగువారి గూడెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం చివరి రోజు ఎన్‌ఎస్‌ఎస్ గీతంతో ఘనంగా ప్రారంభమైంది. గ్రామ ప్రజలు, కౌన్సిలర్, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి శిబిరంపై అభిప్రాయాలను సేకరించారు. స్వచ్ఛభారత్, రోడ్ల శుభ్రత, మౌలిక వసతులు, ప్రజల ఆరోగ్యం వంటి అంశాలపై వాలంటీర్లు చేసిన సేవలను గ్రామస్తులు అభినందించారు. పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. యూనిట్-8 ఆధ్వర్యంలో యానాది కాలనీలో నిర్వహించిన వారం రోజుల ప్రత్యేక శిబిరంలో స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, వ్యక్తిగత పరిశుభ్రత, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు రోజున యాంటీ డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. అనంతరం గ్రామ పిల్లలతో కలిసి ఆటలు నిర్వహించారు. యూనిట్ - 9 ఆధ్వర్యంలో యనమదల గ్రామంలో ప్రత్యేక శిబిరం చివరి రోజు ఎన్‌ఎస్‌ఎస్ గీతంతో ప్రారంభమైంది. గ్రామ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు యాంటీ డ్రగ్స్ ర్యాలీ నిర్వహించారు. సాయంత్ర సమయంలో గ్రామస్తుల నుండి అభిప్రాయాలను సేకరించగా, సర్పంచి, ప్రోగ్రామ్ ఆఫీసర్, వాలంటీర్ల సేవలను ప్రశంసించారు. చివరగా జాతీయ గీతంతో శిబిరం ముగిసింది. ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, పిఆర్‌ఒ జె.సుబ్బారావు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సేవాభావాన్ని అభినందిస్తూ, గ్రామాభివృద్ధికి ఈ ప్రత్యేక శిబిరాలు దోహదపడ్డాయని చెప్పారు.

అప్పలరాజును విడుదల చేయాలి

సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - నిడమర్రు

అక్రమంగా పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేసిన సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజును విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన పీడీ యాక్ట్, అక్రమ కేసులు రద్దు చేసి బేషరతుగా విడుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అడవికొలను గ్రామంలో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణిచివేయడమే ప్రభుత్వ ధ్యేయంగా ఉందన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ప్రజా ఉద్యమాల్లో ప్రజల కోసం పోరాటాలు పనిచేస్తున్న రైతు ఉద్యమ నాయకులు ఎం.అప్పలరాజును అక్రమ అరెస్టు అప్రజాస్వామికమన్నారు. అప్పలరాజును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షులు వెలగలేటి మోహన, కార్యదర్శి, అధ్యక్షులు లావేటి సోంబాబు, సిపిఎం నాయకులు కానూరు రాజు, అందే పుల్లయ్య, గవర చంటి, వర్ధినిడి శ్రీను, కందులపాటి పేరంటాలు, పాల్గొన్నారు.

కనకాద్రిపురాన్ని పంచాయతీగా చేస్తాం

గ్రామస్తులకు ఎంఎల్ఎ బాలరాజు హామీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కనకాద్రిపురం గ్రామాన్ని కుంతలగూడెం పంచాయతీ నుంచి విడదీస్తామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయటానికి కుంతలగూడెం గ్రామం వెళ్తున్న ఎంఎల్ఎకు కనకాద్రిపురం వాసులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో కనకాద్రిపురం గ్రామస్తులతో ఎంఎల్ఎ మాట్లాడారు. 2020 నుంచి కనకాద్రిపురంలో ఉన్న పంచాయతీ భవనం కుంతలగూడెం గ్రామం తరలించడం అన్యాయమని గ్రామస్తులు అన్నారు. పెద్ద మనుషుల ఒప్పందం, పంచాయతీ తీర్మానం కాదని కార్యాలయం నిర్మించాలనుకోవటం తగదని కోరారు. కుంతలగూడెంలో పంచాయతీ భవనం నిర్మిస్తే తమ గ్రామాన్ని ఆ పంచాయతీ నుంచి విడదీయాలని కోరారు. ఇప్పటికే గంగన్నగూడెంలో ఉన్న గ్రామ సంచివాలయానికి ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయలేకపోతున్నామని మొర పెట్టుకున్నారు. ఇప్పుడు పంచాయతీ కార్యాలయం నిర్మించే కుంతలగూడెం గ్రామం ఆరు కిలో మీటర్ల దూరం కానుడటంతో తమ గ్రామాన్ని యర్రంపేట లేదా పొంగుటూరు పంచాయతీలో కలపాలని గ్రామస్తులు లిఖిత పూర్వకంగా కోరారు. అందుకు స్పందించిన ఎంఎల్ఎ రెండు పంచాయతీల్లో ఏది దగ్గరవుతుందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పొంగుటూరు ఒక కిలోమీటర్ దూరంలో ఉందని చెప్పటంతో ఎంపిడిఒతో చెప్పి విడదీస్తామనీ హామీ ఇచ్చారు. కనకాద్రిపురం గ్రామంలో పార్లమెంట్ సభ్యులు నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికి తమ అభివృద్ధి గ్రాంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మ, టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి రామారావు, పరింపూడి సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీను, జనసేన నాయకులు మన్నీడి సాయిబాబా, టిడిపి కనకాద్రిపురం గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు రవి, కార్యదర్శి రాజవరపు శ్రీను, నలమాటి సత్యభామ, మాచర్ల వెంకట గణేష్, జనసేన గ్రామ కార్యదర్శి దుగ్గిరాల పెద్దిరాజు, పండు, అప్పలస్వామి, టెక్కిన తిరుపతిరావు, ఆకుల సత్యనారాయణ, చపల సంకురియ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కొత్త సంవత్సర వేడుకల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు అన్నారు. సిపిఎం పట్టణ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 31వ తేదీ రాత్రి యువత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేకంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరగడం వల్ల అనేక ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క క్షణం సరదా కోసం తీసుకున్న నిర్ణయం కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేస్తుందని తెలిపారు. యువత తమ జీవితాలే కాకుండా తమపై ఆధారపడిన కుటుంబాల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఆశతో ఎదురుచూస్తున్నారని గుర్తించి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వేగంగా వాహనాలు నడపడం, స్టంట్లు చేయడం, హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను నిర్లక్ష్యం చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరం ఆనందంగా ప్రారంభమవ్వాలంటే ప్రతిఒక్కరూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా, అనవసరంగా రోడ్లపై తిరగకుండా స్వీయ నియంత్రణ పాటించాలని చెప్పారు. ప్రమాదాల వల్ల ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్లు నిండిపోకుండా ఇళ్లలో ఆనందం వెల్లివిరించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.

CHANGE OF NAME

I, Nakkella Harischandra Prasad, S/o Satyanarayana, 6-127, Tadimeti Vari Veedhi, Attili, Attili Mandalam, West Godavari-534134. Have Changed My Name From **Nakkella Hari Chandra Prasad (As Per Passport) (Old Name)** To **Nakkella Harischandra Prasad (As Per Aadhar) (New Name).** Hence After All My Documents (Passport, Etc.,) and Correspondence Will Continue With My New Name **Nakkella Harischandra Prasad.**